అసలే ఇరుకురోడ్డు.. ఆపై ట్రాఫిక్ సమస్య

ప్రభుత్వ స్థలం ఉన్నా పీజేఆర్ స్టేడియం వద్ద విస్తరణకు నోచుకోని రోడ్డు | అధికారులకు వినతులు ఇచ్చినా స్పందన కరువు



చందానగర్ పీజేఆర్ స్టేడియం వద్ద ఇరుకుగా ఉన్న రోడ్డు

చందానగర్ : చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ స్టేడియం నుంచి లింగంపల్లి రైల్వే బ్రిడ్జి వరకు వెళ్లే రహదారి ఇరుకుగా ఉండటంతో స్థానికులు, వాహనదారులకు నిత్యం ట్రాఫిక్ వెతలు తప్పడం లేదు. రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో గచ్చిబౌలి, నానకరాంగూడ వైపు వెళ్లే ఐటీ ఉద్యోగులు ప్రధానంగా చందానగర్, గంగారం, మదీనాగూడలకు చెందిన వాహనదారులు పీజేఆర్ స్టేడియం నుంచి శివాజీనగర్ మీదుగా లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వెళతారు. కానీ పీజేఆర్ స్టేడియం వద్దకు రాగానే ఆ ప్రహరీ కాలనీకి ఆనుకొని ఉండడంతో ఒకసారి ఒక వాహనం మాత్రమే వెళ్లేందుకే వీలు పడుతుంది. దీంతో కార్లు, స్కూల్ బస్సులు రావడంతో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు సతమతం అవుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ, పోలీస్ ఉన్నతాధికారులు రోడ్డు విస్తరణతోపాటు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

- రోడ్డుపై గుంతలతో ద్విచక్ర వాహనదారులు సతమతం అవుతున్నారు.
- జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు రోడ్డు విస్తరణపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.
- భారీ వాహనాలు రాకుండా కమాన్ ఏర్పాటు చేసినా వాటి వల్ల ప్రమాదకరమని తొలగించారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది.
- ఎమ్మెల్యే గాంధీ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రోడ్డు విస్తరణ చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.



పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చాం



చందానగర్ పీజేఆర్ స్టేడియం ప్రహరీని 5 అడుగుల మేర జరిపితే రోడ్డు విస్తరణకు అనుకూలంగా ఉంటుంది. రాకపోకలకు ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వ స్థలం కాబట్టి ప్రహరీని తగ్గించవచ్చు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, చందానగర్ ఉప కమిషనర్‌లకు వినతిపత్రాలు అందించా. కానీ పట్టించుకునే అధికారి లేరు.

– రామస్వామి యాదవ్, మాజీ కౌన్సిలర్

ఇరుకురోడ్డులో ట్రాఫిక్ జామ్



చందానగర్ నుంచి గచ్చిబౌలిలోని కార్యాలయానికి వెళ్లాలంటే పీజేఆర్ స్టేడియం వద్దకు రాగానే ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నాం. ఈ సమస్య ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కువగా ఉంటోంది. చందానగర్‌లో అంతర్గత రోడ్లు చాలా ఇబ్బందికరంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు రోడ్డును విస్తరించాలి.

– శేఖర్, వాహనదారుడు



స్టేడియం నుంచి శివాజీనగర్ రోడ్డు





స్టేడియం ప్రహరీ వద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందులు

‘హెడ్‌మాస్టర్‌ను అరెస్ట్ చేయాలి’



డీసీపీ వినీత్‌కు వినతిపత్రం అందిస్తున్న సమితి నాయకులు

గచ్చిబౌలి: వేధించడంతో పాటు అసభ్యంగా ప్రవర్తించిన రాయదుర్గం హెడ్‌మాస్టర్ ఎస్‌కె తాజ్ బాబును అరెస్ట్ చేయాలని కులవివక్ష పోరాట సమితి నాయకులు మాదాపూర్ డీసీపీ వినీత్‌కు వినతిపత్రం అందజేశారు. రాయదుర్గం ప్రైమరీ స్కూల్‌లో ఆయాగా పని చేసే మహిళ తనను వేధించడంతో పాటు అసభ్యంగా ప్రవర్తించాడని ఫిర్యాదు చేయడంతో రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. బాధితురాలితో కలిసి కుల వివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ప్రకాష్ కారత్, శేరిలింగంపల్లి కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు కృష్ణ, రాజు తదితరులు డీసీపీని కలిసిన వారిలో ఉన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మియాపూర్: వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మాణిక్యం తెలిపిన వివరాల ప్రకారం..వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఆర్కా బచ్చార్(26) తన స్నేహితురాలైనా అమీనా బేగంతో మియాపూర్ న్యూ కాలనీ రోడ్డు నంబర్ -6లో ఉంటూ ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఆర్కా తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లక చాలా రోజుల అవుతుందని స్నేహితురాలికి చెబుతూ బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఆర్కా స్నేహితురాలు అమీనాబేగంతో కలిసి మద్యం సేవించి నిద్రపోయారు. గురువారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో అమీనాబేగంకు మెలుకువ వచ్చి చూడగా స్నేహితుడు ఆర్కా బచ్చార్ టవల్‌తో కిటికీకి ఉరేసుకుని కనిపించాడు. వెంటనే మీనాబేగం చుట్టుపక్కల వారి సాయంతో కిందికి దింపి చూడగా అప్పటికే ఆర్కా బచ్చార్ మృతి చెంది ఉన్నాడు. వెంటనే మియాపూర్ పోలీసులకు సమాచారం అందించగా వారు పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అతని తల్లిదండ్రులకు దూరంగా ఉండడంతో వారి వద్దకు వెళ్లలేకపోతున్నానని బాధతో మానసికంగా కుంగిపోయాడని స్నేహితురాలు అమీనాబేగం మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

మియాపూర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. మియాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ న్యూ హఫీజ్‌పేట్ ప్రేమ్‌నగర్ కాలనీలో నివాసముంటున్న కె. రాజ్‌కుమార్(60) ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం 1.30 కు బయటకు వెళ్లాడు.రాత్రి అయినా రాజ్‌కుమార్ ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్విగ్గీ డెలివరీ బాయ్‌పై దాడి.. కేసు నమోదు

గచ్చిబౌలి: ఫుడ్ ఆర్డర్‌ను క్యాన్సిల్ చేయడమే కాకుండా మహిళతో గొడవ పడ్డాడంటూ కొందరు యువకులు స్విగ్గీ డెలివరీ బాయ్‌పై విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ నెల 23న తెల్లవారుజామున మసీద్‌బండకు చెందిన ఓ మహిళ స్విగ్గీలో ఫుడ్ ఆర్డర్ చేసింది. డెలివరీ బాయ్ రమేష్ లొకేషన్ దొరకకపోవడంతో ఆ పరిసరాల్లోనే తిరుగుతున్నాడు. ఆర్డర్ చేసిన మహిళ బిల్డింగ్ అడ్రస్ చెప్పినా అక్కడకు చేరుకోలేదు. ఈ క్రమంలో మహిళకు, స్విగ్గీ డెలివరీ బాయ్‌కి ఫోన్‌లోనే వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో ఆర్డర్‌ను క్యాన్సిల్ చేసి తాను నివాసం ఉంటున్న చిన్న అంజయ్యనగర్‌లో హాస్టల్‌కు వెళ్లాడు. మహిళ తరఫున యువకులు రంజిత్, మింటు బిస్వాష్, నరేష్, భరత్, రమేష్ హాస్టల్ వద్దకు వెళ్లి డెలివరీ బాయ్‌ను బయటకు తీసుకొచ్చి దాడి చేశారు. హాస్టల్‌లో నివాసం ఉండె వారు డయల్ 100 కాల్ చేయడంతో వదిలేసి వెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

చందానగర్ : జమ్ము కశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి శాంతి చేకూరాలని గురువారం రాత్రి చందానగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాప్ వరకు జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్, ఎంబీసీ చైర్మన్ జేరిపేటి జైపాల్, కార్పొరేటర్ పూజిత హాజరయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

30 నుంచి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

రాయదుర్గం: గచ్చిబౌలి శివసాయిక్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 30వ తేదీ నుంచి మే 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు 30వ తేదీ ఉదయం 6 గంటలకు గణపతి పూజతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. అనంతరం అభిషేకం, మండపపూజలు, గణపతి సహస్రనామం, సాయంత్రం 4.30 గంటలకు ధ్వజారోహణ, హోమాలు ,కుంకుమపూజ, హారతి ఇస్తారు. రెండవ రోజైన మే 1వ తేదీ ఉదయం 9 గంటలకు శివ సహస్రనామం, చండీహోమం, రుద్రహోమం నిర్వహిస్తారు, అన్నప్రసాద వితరణ ఉంటుంది.

భూభారతిపై రైతులకు అవగాహన

పటాన్‌చెరు టౌన్: రైతులు భూ భారతి అవగాహన కార్యక్రమంలో పాల్గొనాలని పటాన్‌చెరు తహసీల్దార్ రంగారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శనివారం ఉదయం 10 గంటలకు పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైనారిటీ ఫంక్షన్‌హాల్ వెనుక ఉన్న అంబేద్కర్ భవన్‌లో అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో సదస్సు జరుగుతుందని తెలిపారు.

నేటి నుంచి సమ్మర్ క్యాంప్

జిన్నారం (పటాన్‌చెరు): జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు గుమ్మడిదల మండలంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని నేటి నుంచి మే 13వ తేదీ వరకు 15 రోజుల పాటు నిర్వహించనున్నట్లు గుమ్మడిదల ఎంఈఓ రాంబాబు గురువారం పేర్కొన్నారు.ఈ శిబిరంలో శాస్త్రీయ నృత్యం, సంగీతం, కథలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కుట్లు, అల్లికలు చిత్రలేఖనం, వ్యక్తిత్వ వికాసం, యోగా, ధ్యానం, చదరంగం, ఇండోర్ గేమ్స్, అందమైన చేతిరాత, సైన్స్, గణితం తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల విద్యార్థులు నేటి నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న ‘ప్రతిభాన్వేషణ’



స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్న దివ్యాంగ క్రీడాకారులు



గో సిట్టింగ్ వాలీబాల్ శిక్షణలో క్రీడాకారులు

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయలో ప్రతిభాన్వేషణ కొనసాగుతోంది. పలు క్రీడలలో క్రీడాకారులు తమసత్తాను చాటుతున్నారు. గురువారం శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయ క్యాంపస్‌లో దివ్యాంగ విద్యార్థులకు పారాస్పోర్ట్స్ టాలెంట్ హంట్, ట్రెయినింగ్ క్యాంప్‌ను కొనసాగించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన జవహర్ నవోదయ విద్యాలయలో చదివే దివ్యాంగ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ టి గోపాలకృష్ణ పర్యవేక్షిస్తున్నారు. చండీఘడ్, పాట్నా, పూణే, భోపాల్, హైదరాబాద్ రీజియన్‌లోని జవహర్ నవోదయ విద్యాలయాల నుంచి 160 మంది దివ్యాంగ బాలబాలికలు పాల్గొంటున్నారు. ఆర్మ్ రెజ్లింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్, తైక్వాండో, షూటింగ్, బ్యాడ్మింటన్, ఆర్చరీ, జూడో, సిట్టింగ్ వాలీబాల్, అథ్లెటిక్స్ నిర్వహిస్తున్నారు.

చెరువుల సంరక్షణ సామాజిక బాధ్యత

రాయదుర్గం: ప్రశాంత్‌హిల్స్ కాలనీవాసుల కృషి అభినందనీయమని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. ప్రశాంత్‌హిల్స్ కాలనీలో కుమ్మరికుంట చెరువు సుందరీకరణలో భాగంగా ప్రశాంత్ హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గేట్‌ను ఏర్పాటు చేయగా దాన్ని ప్రారంభించి మొక్క నాటారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు సమిష్టి కృషితో చెరువును శుభ్రంగా ఉంచుకోవడం అభినందనీయమన్నారు. శేరిలింగంపల్లిలో 64 చెరువులను అభివృద్ధి చేస్తామన్నారు. చెరువుల సంరక్షణ సామాజిక బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు జగదీష్, శేఖర్‌రెడ్డి, ప్రభాకర్, రాజు, పద్మ, అమర్ పాల్గొన్నారు.



ప్రశాంత్‌హిల్స్‌కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

వలస కార్మికుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్

పటాన్‌చెరు టౌన్: వలస కార్మికుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ అన్నారు. గురువారం పటాన్‌చెరులోని శ్రామిక్ భవన్‌లో వలస కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే 20 జరిగే సమ్మెలో వలస కార్మికులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.వలస కార్మికులను బానిసల్లాగా పరిశ్రమలు, సంస్థల యజమానులు చూస్తున్నారని, ఈ పద్ధతి మారాలన్నారు. వలస కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. పని గంటలు, కనీస వేతనం ,ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా, సెలవులను అమలు చేయడం లేదన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వలస కార్మికులందరూ ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రాజయ్య, నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పటాన్‌చెరు: తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఘనపూర్ గ్రామంలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఆలయ ధర్మకర్త బాసిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ నీనా తదితరులు పాల్గొన్నారు.

నేడు గుమ్మడిదలలో గ్రామసభ

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 109లో నూతనంగా ఏర్పాటు చేయనున్న పారిశ్రామికవాడకు భూసేకరణ నిమిత్తం ఉదయం 10 గంటలకు ఆ సర్వే నెంబర్లో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసిల్దార్ పరమేశం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సకాలంలో పాల్గొని డాక్యుమెంట్లను చూపాలని విజ్ఞప్తి చేశారు.


కాలనీల్లో రోడ్లు వేయాలని వినతి



డీఈ విశాలాక్షికి వినతిపత్రం ఇస్తున్న టీఎన్‌జీఓ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు

రాయదుర్గం: టీఎన్‌జీఓ కాలనీలో రోడ్లు వేయాలని కోరుతూ జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి డీఈ విశాలాక్షికి కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతపత్రం ఇచ్చారు. గురువారం జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో టీఎన్‌జీఓ కాలనీ అధ్యక్షుడు గడ్డం జంగయ్య ఆధ్వర్యంలో సభ్యులు ఆమెను కలిశారు. కాలనీలో రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరిగిపోతోందని సాఫీగా వెళ్ళడానికి రోడ్లు వేయాలని ఆమె దృష్టికి తెచ్చారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు జంగయ్య వివరించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి కె జోసెఫ్, సభ్యులు జీవి రామారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలి



గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ గజారావు భూపాల్ సూచించారు. గురువారం వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డితో కలిసి పనులను పరిశీలించారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని పనులను వేగవంతం చేయాలని జడ్సీని కోరారు. జంక్షన్లతో ఇరుకుగా ఉన్న చోట విస్తరణ పనులు సాగుతున్నాయని, త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్‌సీయూ డిపో జంక్షన్, కొండాపూర్ ఆర్టీఓ ఆఫీస్, మసీద్‌బండ, అంజయ్యనగర్ లేబర్ అడ్డా, గచ్చిబౌలి జడ్పీహెచ్ఎస్ స్కూల్ తదితర చోట్ల విస్తరణ పనులను ఇప్పటికే ప్రారంభించామని ఉపేందర్ రెడ్డి తెలిపారు. సమన్వయ సమావేశాల్లో గుర్తించిన ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు జంక్షన్లు, రోడ్ల విస్తరణకు శ్రీకారం చుట్టామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్, గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1, ఫేజ్ 2, తులసినగర్, శ్రీ తులసి నగర్, కాకతీయనగర్, చంద్రమ్మ బస్తీ, పంచమి కాలనీ, ఉజ్జయిని మహంకాళినగర్ కాలనీలో 2 కోట్ల 8 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

హైదర్‌నగర్ డివిజన్‌లో...

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జలవాయువిహార్, రామ్‌నరేష్ నగర్, అల్లాపూర్ సొసైటీ, మైనార్టీ స్కూలు, విజేత గ్రీన్‌హోమ్స్, కిందికుంట చెరువు నుంచి కోనసీమ వంటిల్లు ప్రాంతం వరకు, హెచ్‌యంటి శాతవాహననగర్ కాలనీల్లో సుమారు 2 కోట్ల 9 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా సాగుతున్నామన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు



భారతీనగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు నిధులను కేటాయిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం భారతీనగర్, రామచంద్రాపురం డివిజన్ల పరిధిలో పలు కాలనీలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా చేసే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అభివృద్ధి పనులలో నాణ్యత తప్పనిసరి అని పేర్కొన్నారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో కార్పొరేటర్‌లు వి.సింధురెడ్డి, పుష్ప, మాజీ కార్పొరేటర్ అంజయ్య, నాయకులు ఐలేష్ యాదవ్, పరమేష్‌లు పాల్గొన్నారు.

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా డిజైన్ చేయాలి

- ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ ఈడీ డా.తేజ్‌లోహిత్‌రెడ్డి



చెరియాల్ పెయింటింగ్‌లను పరిశీలిస్తున్న ఈడీ డా.తేజ్‌లోహిత్‌రెడ్డి

రాయదుర్గం: భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా డిజైన్లు రూపకల్పన చేయాలని ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎస్ తేజ్‌లోహిత్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ క్యాంపస్‌లో గురువారం డిజైన్‌సింక్ పేరిట సాగుతున్న ప్రదర్శనలో భాగంగా చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన, వారు కోరుకుంటున్న రీతిలో డిజైన్లను రూపొందిస్తే ఆదరిస్తారన్నారు. డిజైన్ల రూపకల్పనలో కూడా ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌ను వినియోగించాలన్నారు. అనంతరం డిజైన్ల రూపకల్పనలో ఏఐ ప్రాముఖ్యతపై పలువురు మాట్లాడారు. ప్రదర్శనలో భాగంగా చెరియాల్ పెయింటింగ్, బాతిక్ పెయింటింగ్ ప్రదర్శనను తేజ్‌లోహిత్‌రెడ్డి ప్రారంభించారు. వాటి ప్రాముఖ్యత, తయారీ గురించి విద్యార్థులకు వివరించాలని సూచించారు. అనంతరం కళాకారులు, వక్తలను సన్మానించారు. సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండాపూర్ పాఠశాలలో బ్రెజిల్ బృందం

గచ్చిబౌలి: భారతదేశంలో విద్యావిధానం, పట్టణ, గ్రామీణ ప్రాంతాల పరిస్థితులను తెలుసుకోవడానికి వచ్చిన బ్రెజిల్ బృందం కొండాపూర్ ప్రభుత్వ పాఠశాలను గురువారం సందర్శించింది. తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, బ్రెజిల్ ఎంపీ, విద్యా సలహాదారు లూసియానా, సీజర్‌లు సందర్శించారు. పాఠశాలలో సౌకర్యాలు, బోధనా పద్ధతులు, విద్యార్థుల పరిస్థితి, మౌలిక వసతులు, ఇతర అంశాలను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటయ్య, జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, హెచ్ఎం ఉమాదేవి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ హెచ్ఎం అనంతరెడ్డి ఉన్నారు.